

తుర్కపలి : ధర్మారంలో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

## గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

తుర్కపల్లి, మే 10 : గ్రామాలు, గిరిజన తండాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి ధర్మారం నుంచి బీల్యానాయక్‌తండా వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

# 'నాకు బతుకాలని లేదు'

- కాంగ్రెస్ నాయకులు చిత్రహింసలు పెట్టారు
- నా చావుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల రామిరెడ్డి కారణం
- బహిరంగ లేఖ రాసి అజ్ఞాతంలోకి వెళ్లిన కాచారం వీబీకే సంధ్య

యాదగిరిగుట్ట, మే 10 : 'నాకు బతుకాలని లేదు.. రెండు నెలల నుంచి గ్రామంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు ఎడ్ల రామిరెడ్డితో పాటు ఆయన అనుచరులు న్యాలపట్ల నర్సింహులు, బెజాడి నర్సింహులు, వైద్యుల తిరుపతి, నమిలె ఆంజనేయులు, వైద్యుల ప్రకాశ్, ప్రభాకర్, పుట్ట శ్రీను, భాస్కర్, వడిగె ఇస్తారి, బర్మ చంద్రయ్య, చింతపండు భామయ్యతో పాటు 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలు నన్ను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.' అని మండలంలోని కాచారం గ్రామానికి చెందిన వీఏఓ సంధ్య ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆమె బహిరంగ లేఖ రాసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. లేఖలో ఉన్న వివరాలివి. నాపై అధికారులకు లేనివి, ఉన్నవి కల్పించి పదే పదే ఇబ్బందులు గురిచేసి పైశాచికానందం పొందుతున్నారు. మహిళ అని చూడకుండా అసభ్యకర పదజాలంలో దూషించడంతోపాటు స్థానిక ఎమ్మెల్యే, డీఆర్‌డీఏ, ఏపీఎంకు తప్పుడు ఆరోపణలు చేసి మానసికంగా వేధిస్తున్నారు. నన్ను విధుల నుంచి తొలగించాలనే కక్షతో సంఘాల సభ్యులను బెదిరించి ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. సంతకాలు పెట్టిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. కాచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల రాంరెడ్డ తన సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే గారి ఇంటి వద్దకు తీసుకెళ్లి అక్కడికి వెళ్లిన తర్వాత తనను విధుల నుంచి తీసివేయడానికి వచ్చామంటూ డీఆర్‌డీఏ వద్ద నాపై ఉన్నవి లేవిని కల్పించి ఫిర్యాదు చేశారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యుల కన్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే అధికంగా వచ్చి మహిళలను మాట్లాడనీయకుండా అందరి నోర్లు మూయించి ఎడ్ల రాంరెడ్డి తన ప్రతాపాన్ని చూపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాలపట్ల నర్సింహ నన్ను వందల మందిలో బజారుదానివి, తిరుగుబోతుదానివి, నీది ఏ ఊరంటూ అసభ్యకర పదజాలంతో దూషిస్తుంటే కాంగ్రెస్ కార్యకర్తలు నవ్వుకుంటూ నన్ను మానసికంగా తీవ్ర ఇబ్బందికి గురి చేశారు. సంఘాల సభ్యుల తీర్మానం లేకుండా వారి నిర్ణయాన్ని అడగకుండా, ఎడ్ల రాంరెడ్డి చెప్పడంతో ఎటువంటి నోటీసు లేకుండానే అధికారులు అకారణంగా విధుల నుంచి తొలగించారు. ఈ కక్ష సాధింపు చర్యలతో నాకు బతుకాలని లేదు. నా చావుకు కారణం ఎడ్ల రాజిరెడ్డి, అతని అనుచరులే.' అని సంధ్య ఉత్తరం రాసి అజ్ఞాతంలోకి వెళ్లింది. దీనిపై ఏపీఎం సుధాకర్‌ను వివరణ కోరగా అయన స్పందించలేదు.

# రైతులు ఆగమైతుంటే అందాల పోటీలా..?

- అన్నదాతను నట్టేట ముంచిన కాంగ్రెస్ సర్కార్
- రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదాద్రి భువనగిరి, మే 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రైతు అన్ని విధాలుగా నష్టపోయి.. ఆగమైతుంటే ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించడమేంటని ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ కరువు, అకాల వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అన్నదాతలను ఆదుకోవాలనే సోయి లేకుండా రేవంత్ సర్కార్ ఉన్నదని విమర్శించారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలై, అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నదన్నారు. అన్నదాత అరిగోస పడుతుంటే అందాల పోటీలకు రూ. 200 కోట్లు కేటాయించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. అధికారం కోసం కాంగ్రెస్ అమలు కాని హామీలను ఇచ్చి నేడు వాటిని తుంగలో తొక్కిందన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి సగం మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చే సమయానికి కేసీఆర్ ఇస్తామన్న రైతు బంధు డబ్బులు ఇచ్చారని, ఆ తర్వాతి సీజన్‌ను ఎగ్గొట్టారని మండిపడ్డారు. యాసంగి సీజన్ లో కేవలం 3 ఎకరాల్లోపు రైతులకు ఇచ్చారని, మిగతావి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు బీమా పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో రాష్ట్రం దివాలా తీసిందని, అప్పు పుట్టడం లేదని చెప్పడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చేతకాకపోతే పాలన నుంచి తప్పుకోవాలి కానీ రాష్ట్ర పరువు తీయొద్దని హితవు పలికారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో రానున్న అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# కాళీయమర్ధనుడిగా లక్ష్మీ నరసింహుడు



కాళీయమర్ధనుడిగా ఊరేగుతున్న స్వామివారు

యాదగిరిగుట్ట, మే 10 : లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో నృసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శనివారం ప్రధానాలయ ముఖ మండపంలో ఉదయం 8.45 గంటలకు నిత్యాహవనం, మూలమంత్ర జపాలు పఠించారు. లక్ష్మీసూక్త, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, నవ కలశస్నపనం చేపట్టారు. ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామివారిని కాళీయమర్ధనుడిగా అలంకరించి ప్రధానాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 6 గంటలకు నిత్యాహవనాలు, హవనాలు, సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనం నిర్వహించారు. స్వామివారిని శ్రీరాముడిగా అలంకరించి మాఢ వీధుల్లో ఊరేగించారు. హనుమంత వాహనంపై శ్రీరామ అలంకార సేవలో నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలు శాస్త్రోక్తంగా సాగాయి. వేడుకల్లో ఈఓ వెంకట్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఏఈఓలు రఘుబాబు, రమేశ్ బాబు, నవీన్, పర్యవేక్షకులు రాజన్‌బాబు పాల్గొన్నారు.

**నేటితో ఉత్సవాలు పరిపూర్ణం..**

లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు పూర్వగిరి(పాతగుట్ట) ఆలయంలో ఉదయం 7 గంటలకు మూలమస్త్ర హవనం, 9 నుంచి 9.30 గంటల వరకు మహాపూర్ణాహుతి, సహస్రకలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థప్రసాద గోష్టితో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.



ఆర్డీఓ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న శివసేన రాష్ట్ర కార్యదర్శి పూస శ్రీనివాస్

## అందాల పోటీలు అవసరమా : శివసేన

భువనగిరి అర్బన్, మే 10: పాకిస్థాన్‌తో భారతదేశం యుద్ధం చేస్తున్న క్రమంలో ప్రజలు, దేశ రక్షణ కోరుకుంటుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించడం అవసరమా అని శివసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూస శ్రీనివాస్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపి ఆర్డీఓ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం వేళ అందాల పోటీలు నిర్వహించడం అవసరమా అని? ప్రశ్నించారు. లేని యెడల ఈ పోటీలను శివసేన ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. దేశంలో బీసీసీఐ క్రికెట్‌ను రద్దు చేశారని తెలిపారు. రాష్ట్రంలో మూడంచల భద్రత పెట్టి నిర్వహించడం అవసరమా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివసేన పార్టీ నాయకులు శివ, శేఖర్, హరికాంత్, మధు, రతన్‌లాల్, సత్తి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 12 నుంచి స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు

బీబీనగర్, మే 10 : పట్టణ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు సబ్ రిజిస్ట్రార్ నరేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానం ప్రవేశపెట్టిందని, కొత్త విధానం ద్వారా రోజుకు 48 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులు స్లాట్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారా మాత్రమే అనుమతించనున్నట్లు చెప్పారు. కొత్త విధానం ద్వారా 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవచ్చని తెలిపారు.

## సీఐ కొండల్‌రావుకు బీఆర్ఎస్ నాయకుల సన్మానం



సీఐ కొండల్‌రావును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరురూరల్, మే 10 : సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొండల్‌రావును మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుండ్లగూడెం మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంపల విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందుల రామన్ తదితరులున్నారు.



ముక్తాపూర్ – జూలూరు రహదారిలో నరికేసిన చెట్లు

## హరితహారం మొక్కలు తొలగింపు

భూదాన్ పోచంపల్లి, మే 10 : మండలంలోని ముక్తాపూర్ – జూలూరు రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నరికేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అవి ఇప్పుడు ఏపుగా పెరిగి కళకళలాడుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. అధికారులు స్పందించి చెట్లు నరికిన వారిని శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## బాల సదన్‌లో చేరిన బాలిక

భువనగిరి అర్బన్, మే 10 : బాల పరిరక్షణ విభాగం సిబ్బంది మందలించిందని ఓ బాలిక శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చౌటుప్పల్ కేజీబీవీలో ఏర్పాటు చేసిన వృత్తి విద్యా కోర్సు వేసవి శిబిరానికి భువనగిరి బాల సదన్ నుంచి వెళ్లిన బాలిక శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పూర్తయ్యాక శనివారం అధికారులు తిరిగి బాలికను బాలసదన్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నంపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంబంధిత బాలికతో మాట్లాడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను అడిగి తెలుసుకుని వాంగ్మూలం నమోదు చేశారు. రెండు, మూడు రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక చేరవేస్తామని పోలీసులు చెప్పారు.

## కుంటుపడిన అభివృద్ధి : అంజయ్య



కొలనుపాక విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య

ఆలేరురూరల్, మే 10 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య విమర్శించారు. మండలంలోని కొలనుపాకలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ గ్రామంలో కొన్ని రోజుల నుంచి పలు వీధుల్లో వీధి లైట్లు వెలగక అంధకారంలో ఉన్నాయన్నారు. అధికారుల పాలనలో గ్రామంలో పారిశుధ్యం పడకేసిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జంగ స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరి కాలేందర్‌గౌడ్ తదితరులున్నారు.



ఆత్మకూరు(ఎం) : రాఘవాపురంలో ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మే 10 : మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన ఎరుకల కేశవులుగౌడ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో రూ.5వేల నగదును స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు ఎరుకల యతీశ్వర్‌గౌడ్, నరేశ్, వెంకన్న, శ్రీశైలం, హైమద్ పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు నమ్మొద్దు : ఎస్ఐ ఉపేందర్



మాట్లాడుతున్న ఎస్ఐ నాగుల ఉపేందర్

మోటకొండూర్, మే 10 : సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలను ప్రజలు నమొద్దని ఎస్ఐ నాగుల ఉపేందర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం అఖిల పక్ష నాయకులతో రాచకొండ సీపీ ఆదేశాల మేరకు శాంతి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

## రైలు నుంచి పడి వ్యక్తి మృతి


భువనగిరి అర్బన్, మే 10: మండల పరిధిలో శనివారం గుర్తు తెలియని వృద్ధుడు ఓ రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిలో మీటర్ నంబర్ 233/28–30 దగ్గర దిగువ లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏండ్లు ఉంటుందని, మృతుడి ఎడమ చేయి పైన ఫర్జానా, కుడి చేయి పైన స్వరూప అక్క అని టాటూ ఉందని చెప్పారు. ఒంటిపై కాఫీ నీలం కలర్ టీ షర్ట్, ఎరుపు ఫుల్ డ్రాయర్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. నల్లని గడ్డం, వెంట్రుకలు ఉన్నాయని, మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె. కృష్ణారావు మొబైల్ 9848222169, 8712568454 లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ధాన్యం చోరీపై తాసీల్దార్ విచారణ



నర్సాపూరంలో విచారణ చేపడుతున్న తాసీల్దార్ అనిత

రాజాపేట, మే 10 : మండలంలోని నర్సాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాజాపేట రైతు నమిలే శ్రీహరికి చెందిన ధాన్యం చోరీ ఘటనపై తాసీల్దార్ అనిత శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కేంద్రం వద్ద రాత్రి వేళల్లో పర్యవేక్షణ ఉండాలని, చోరీ విషయంపై దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. అమె వెంట ఆర్ఐ రమేశ్, ఏఎస్ఐ మైసయ్య పాల్గొన్నారు.



రామన్నపేట : కొమ్మాయిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న హెచ్ఎం మురళీధర్

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి : హెచ్ఎం మురళీధర్

రామన్నపేట, మే 10 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కొమ్మాయిగూడెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మురళీధర్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం కొమ్మాయిగూడెం గ్రామంలో అఖిలపక్ష నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సఫియాబేగం, విజయవెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భారత సైన్యానికి రూ.5 వేల విరాళం

రాజాపేట, మే 10 : పాకిస్థాన్‌తో పోరాటం చేస్తున్న భారత సైన్యం సంక్షేమం కోసం మండలంలోని బేగంపేటకు చెందిన జెల్ల పాండు రూ. 5 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరాడుతున్న సైనికుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు తన వంతు విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా విరాళం అందజేయనున్నట్లు చెప్పారు.



బొందుగుల కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న లింగం

## మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

రాజాపేట, మే 10 : ధాన్యం బస్తాల్లో కోత విధిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం అన్నారు. మండలంలోని బొందుగుల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో విక్రయించగా, బస్తాల్లో కోత విధిస్తూ మిల్లర్లు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన రైతులు రాజమైన కొమురయ్యకు చెందిన 545 ధాన్యం బస్తాలకు గాను 8 బస్తాలు, రాజం సత్యనారాయణకు చెందిన 404 బస్తాలకు గాను 5 బస్తాలు, బాల్ద శ్రీశైలం, దేవేందర్‌రెడ్డి, ఎల్లయ్యకు చెందిన ధాన్యాన్ని లెక్క ప్రకారం తూకం వేయగా 5 బస్తాల మేరకు మిల్లర్లు కోత విధించారని తెలిపారు. బస్తా మీద ధ్యానం కిలోన్నర అదనంగా దండుకుంటున్నారని ఆరోపించారు. మిల్లర్లతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులను దగా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూల పోచయ్య, బాల్ద శ్రీశైలం, పుట్ట గణేశ్, జంగిటి సిద్దులు, పల్లె మల్లయ్య పాల్గొన్నారు.

YASHODA CONVENTION
(A/c Function Hall)
INAUGURAL DISCOUNT 25%
Anantharam Village
Gundala Mandal,
Yadadri Bhuvanagiri Dist.
Ph: 98856 00234

## మార్కెట్ కమిటీకి సన్మానం



మార్కెట్ కమిటీని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చౌటుప్పల్, మే 10 : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లను శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయ లింగస్వామి, సీనియర్ నాయకులు బక్క శ్రీనాథ్, గుడ్డేటి యాదయ్య, మేడి యాదయ్య, బొడ్డు శ్రవన్‌కుమార్, బోయ రాము పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ

సంస్థాన్ నారాయణపురం, మే 10 : మండలంలోని పుట్టపాక, సర్వేల్, నారాయణపురంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు నిర్వహించే వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ గోలి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇండోర్ అవుట్ డోర్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.



ఆత్మకూరు(ఎం)లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

## కొవ్వొత్తుల ర్యాలీ

ఆత్మకూరు(ఎం), మే10 : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు, పాక్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసు చందర్ గౌడ్, ఇంద్రారెడ్డి, భిక్షపతి, దశరథగౌడ్, వెంకన్న, విజయ్, స్వామి, బీరప్ప, మల్లేశం, దామోదర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

## భారత జవాన్లకు మద్దతుగా ర్యాలీ

చందంపేట(దేవరకొండ), మే 10 : ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు ధీటుగా జవాబిస్తున్న భారత ఆర్మీకి మద్దతుగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తా నుంచి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వీటి, నాయకులు జక్క శ్రీనయ్య, సుజిత్, క్రాంతి, నర్సింహ, కోటి, పాపానాయక్, పాండునాయక్, రాంసింగ్, శంకర్, ఎంఈఓ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## రోడ్డువెంట అల్లుకున్న పచ్చదనం



ఆత్మకూరు(ఎం) కూరెళ్ల, రహీంఖాన్‌పేటలో అల్లుకున్న పచ్చదనం

ఆత్మకూరు(ఎం), మే 10 : మండలంలోని కూరెళ్లకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో హరితహారం కింత నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి స్థానికులకు ఆహ్లాదాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. రోడ్డు ప్రమాదంలో వాహనదారులు ప్రయాణికులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.